క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థినికి ఆర్థిక సాయం



పద్మజకు చెక్కు అందజేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: క్షత్రియ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని పూసపాటి పద్మజ సహస్రకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. బాలయ్యశాస్త్రి లేవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థినికి చెక్కు అందజేశారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, క్షత్రియ యూత్ వింగ్ ప్రెసిడెంట్ జి.పృథ్వీరాజు, సెక్రటరీ జి.శ్రవణ్ వర్మ, కోశాధికారి వి.అభివర్మ, కిరణ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఏసీఈ సంస్థ శిక్షణతో ప్రభుత్వ ఉద్యోగాలు



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాసరావు

సీతమ్మధార: ఐఏసీఈ సంస్థ ద్వారా శిక్షణ పొందిన ఎంతో మంది బ్యాంకు, రైల్వే, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ద్వారకానగర్‌లోని సంస్థ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామమాత్రపు ఫీజుతో ఉద్యోగం వచ్చే వరకు చక్కటి ఇస్తున్నామని తెలిపారు. ఐఏసీఈలో చేరిన విద్యార్థి ఒక్కసారి ఫీజు చెల్లిస్తే ఉద్యోగం వచ్చే వరకు క్వాలిటీతో కూడిన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురం పోర్టు ఆస్పత్రి సమీపంలోని పోర్టు భూములను కార్పొరేట్‌కు కట్టబెట్టడాన్ని విరమించుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం కోరారు. ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనను వ్యతిరేకిస్తూ శనివారం పోర్టు ఆస్పత్రి వద్ద సీపీఎం నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ పోర్టు అభివృద్ధి లేదా విశాఖ ప్రజల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ భూములు కార్పొరేట్ పరం చేయడం దారుణమన్నారు. పార్టీ నాయకులు ఆర్కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు, యూఎస్ఎన్ రాజు, ఆర్ఎన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వెంకన్నకు పూజలు



స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు. ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ పి.శాంతారాం, సాధారణ వ్యాధుల నిపుణుడు డాక్టర్ సంతోష్ బీపీ, సుగర్ టెస్ట్‌లు చేస్తారని పేర్కొన్నారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

SUNDAY SPECIAL

కలెక్షన్ కింగ్

- పురాతన నాణాలు, స్టాంపుల సేకరణలో దిట్ట రవిశంకర్‌రెడ్డి
- తన సేకరణతో నాటి ప్రపంచం కళ్లకు కడుతుందంటూ ధీమా

కొందరికి సేవ చేయాలనే తపన.. మరికొందరికి కళల్లో రాణించాలనే అభిలాష.. ఇంకొందరికి క్రీడలపై మక్కువ.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో రంగంలో రాణించాలనుకుంటారు. రవిశంకర్‌రెడ్డి వివిధ దేశాల కాయిన్స్, స్టాంపుల సేకరణ అంటే ఆసక్తి చూపుతారు. దశాబ్దాల కిందటి బైక్‌లు.. పాతకాలం నాటి ఏడు రకాల సైకిళ్లను తన ఇంట్లో మ్యూజియంగా ఏర్పాటు చేసుకున్నారు.



ట్రూ ఫ్రెండ్స్ పేరిట ముంబై మింట్ విడుదల చేసిన కలర్ కాయిన్

దాబాగార్డెన్స్: నాణాలు.. పాత వాహనాలు.. పలు దేశాల స్టాంపులు, పురాతన కార్లను సేకరిస్తూ అభిరుచి చాటుతున్నారు రవిశంకర్‌రెడ్డి. ఏడు తరాల వృక్షమంటూ ఒక వర్ణచిత్రాన్ని రూపొందింపజేసి కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి తగిలించారు. సాధారణంగా నాన్న.. తాత.. ముత్తాత వరకు ఎవరికైనా తెలుస్తుంది. కానీ ఏడు తరాల వారి పేర్లతో ఏర్పాటు చేసిన వంశవృక్ష చిత్రాన్ని తన ఇంటికి ఏర్పాటు చేసుకున్నారు. పురాతన చరిత్ర.. అప్పటి సంప్రదాయాలను స్టాంపులు, భిన్నరకాల వస్తువులు తెలియజేస్తాయని రవిశంకర్‌రెడ్డి చెబుతుంటారు. విద్యార్థులు.. భావితరాలకు అవి స్ఫూర్తిగా నిలుస్తాయంటున్నారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన రవిశంకర్‌రెడ్డి విదేశీ కాయిన్స్, కరెన్సీతో పాటు పురాతన వస్తువులను సేకరించటంలో దిట్ట. 1957 నుంచి భారతదేశంలో వాడే ద్విచక్ర వాహనాలు ఆయన వద్ద ఉన్నాయి. అరుదైన భారతీయ నాణాలు, నోట్లను సేకరించడమే కాక, 122 దేశాల విదేశీ కరెన్సీ, డాలర్లు, 67 దేశాల స్టాంపులు సేకరించారు.

కాయిన్స్ ఇలా..

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కోల్‌కతా మింట్ విడుదల చేసిన రూ.50 మొదటి కాయిన్‌ను 2018లో రవిశంకర్‌రెడ్డి రూ.3580కు పొందారు. ఆ తర్వాత రూ.500 కాయిన్‌ను సాధించారు. నాలుగేళ్ల కిందట రూ.200 నాణెం సేకరించారు. మూడేళ్ల కిందట రూ.1000 నాణెం సొంతం చేసుకున్నారు. గతంలో రూ.10, రూ.20, రూ.100, రూ.150 వంటి కాయిన్లు సేకరించారు. ఏడాది కిందట రూ.75, రూ.350, రూ.550 నాణాలు సేకరించిన రవిశంకర్‌రెడ్డి, రాజ్యసభ 250వ సమావేశాన్ని పురస్కరించుకుని ముంబై మింట్ ఎనిమిది నెల కిందట విడుదల చేసిన రూ.250 కాయిన్‌ను కూడా సొంతం చేసుకున్నారు.

ఇటీవల కలెక్షన్లు..

గురుతేగ్ బహదూర్ 400వ జయంతి సందర్భంగా ముంబై మింట్ విడుదల చేసిన రూ.400 కాయిన్‌ను రవిశంకర్‌రెడ్డి రూ.4,429కు చేజిక్కించుకున్నారు. అలాగే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభించి 175 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ముంబై మింట్ ఇటీవల విడుదల చేసిన రూ.175 కాయిన్‌ను రూ.3,580కి కొనుగోలు చేసి విశాఖలో అరుదైన కాయిన్లు.. కరెన్సీ సేకరణలో కలెక్షన్ కింగ్‌గా నిలిచారు. అలాగే నూతనంగా ముంబై మింట్, కోల్‌కతా మింట్ చిన్నారుల నీతి కథలకు సంబంధించి పంచతంత్రంలో భాగంగా ఇటీవల విడుదల చేసిన 2 కలర్ కాయిన్స్, కోల్‌కతా మింట్ విడుదల చేసిన ఒక డాలర్ కాయిన్‌ను రవిశంకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. మంకీ అండ్ క్రొకొడైల్, ట్రూ ఫ్రెండ్స్ పేరిట ముంబై మింట్, క్రో అండ్ స్నేక్ పేరిట మంచి సందేశాత్మకాన్నిచ్చే కోల్‌కతా మింట్ విడుదల చేసిన కలర్ కాయిన్స్‌ను సొంతం చేసుకుని విశాఖ చరిత్రలో తొలి వ్యక్తిగా నిలిచారు.



రూ.400 కాయిన్



రూ.175 కాయిన్



క్రో అండ్ స్నేక్ పేరిట కోల్‌కతా మింట్ విడుదల చేసిన కాయిన్



ది మంకీ అండ్ క్రొకొడైల్ పేరిట ముంబై మింట్ విడుదల చేసిన కలర్ కాయిన్

చరిత్రను చాటి చెప్పాలనే..



పాత కాలం వస్తువులు.. పాత కరెన్సీ సేకరించడం చిన్నప్పటి నుంచి నా హాబీ. పైసా నుంచి రూ.5, రూ.10తోపాటు కోల్‌కతా.. ముంబై మింట్ వివిధ సందర్భాల్లో విడుదల చేసిన ఎన్నో కాయిన్లను సేకరించాను. మా ఇంటి నిండా 1957 నుంచి దేశంలో వాడే ద్విచక్ర వాహనాలు, అరుదైన భారతీయ నాణాలు, నోట్లు ఉన్నాయి. 122 దేశాల విదేశీ కరెన్సీ, డాలర్లతోపాటు 67 దేశాల స్టాంపులు సేకరించాను. మన చరిత్రతోపాటు ప్రపంచ చరిత్రను కూడా తెలిపేలా నా సేకరణ ఉండాలని, విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలనేది నా కోరిక.

– రవిశంకర్‌రెడ్డి, కాయిన్స్ కలెక్షన్ కింగ్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌మెన్

నవరస మూర్తికి 'సురభి' పురస్కారం



పి.వి.రమణమూర్తి

సీతంపేట: రంగస్థల నటుడు, దర్శకుడు పి.వి.రమణమూర్తి(నవరస మూర్తి)కి సురభి రంగస్థల సేవా పురస్కారం ప్రదానం చేయనున్నట్టు రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1న సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరగనున్న రంగసాయి నాటక సంఘం 13వ వార్షికోత్సవంలో అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందజేస్తామన్నారు. సురభి నాటక ప్రాభవ కృషీవలుడు పద్మశ్రీ రేకందార్ నాగేశ్వరరావు(సురభి బాబ్జి) పేరిట ఈ పురస్కారం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. రంగస్థల నటుడు, దర్శకుడు, నాటక రచయిత, నట శిక్షకుడు, నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, నిరంతరం నాటకం గురించి పరితపించే పి.వి.రమణమూర్తికి ఈ పురస్కారం అందజేయడం ఔత్సాహిక కళాకారుల్లో స్ఫూర్తిని నింపుతుందన్నారు. వేడుకల్లో స్థానిక కళాకారుల ఏకపాత్రాభినయ ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. రంగస్థల కళాకారులు, సురభి అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పురందేశ్వరిపై మండిపడ్డ అఖిలపక్షం

దాబాగార్డెన్స్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. ఆమె మాటలు వింటుంటే తెలుగు రాష్ట్ర ప్రజల కోసం కాకుండా.. కేంద్రంలోని బీజేపీకి తొత్తుగా మారినట్టు ఉన్నాయని ఎద్దేవా చేశారు. సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు బీజేపీపై తీవ్రంగా మండిపడ్డారు. విశాఖ ఎంపీగా.. కేంద్ర మంత్రిగా పని చేసి విశాఖకు, ఏపీకి ఏమీ చేయకపోగా.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ పంచన చేరి, ఆ పార్టీకి అనుకూలంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఎం నేత బి.గంగారావు, సీపీఐ నేత ఎం.పైడిరాజు, వై.కొండయ్య, కె.శంకరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

పక్కాగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు



కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, ఓటరు లిస్ట్ వెరిఫికేషన్, పార్టీ బలోపేతం, సంక్షేమ పథకాల అమలు తీరుపై శనివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా, లేని పక్షంలో వెంటనే సమస్య పరిష్కరించాలని కె.కె.రాజు సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, బర్కత్ అలీ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సొండి కులస్తులను ఓబీసీలో చేర్చాలని వినతి



వై.వి.సుబ్బారెడ్డికి సమస్యను విన్నవిస్తున్న పాండవ శ్రీనివాసరావు

సీతంపేట: సొండి కులస్తుల సమస్యలను పరిష్కరించాలని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పాండవ భారతీయ శ్రీనివాసరావు, పాండవ అంబరీష్, కాజల్‌లు కోరారు. ఈమేరకు శనివారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజినిలకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ 'డీ'లో ఉన్న సొండి కులస్తులను ఓబీసీలో చేర్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైల్వే ప్రాజెక్టులపై జీవీఎల్ సమీక్ష



ఎంపీ జీవీఎల్‌కు వివిధ ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్‌లో జరుగుతున్న పలు ప్రాజెక్టులపై రాజ్యసభ సభ్యుడు, జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు శనివారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను కలిశారు. వివిధ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. గత వారం రైల్వేస్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన దృష్టికి వచ్చిన పలు సమస్యలను డీఆర్ఎం తెలియజేశారు. వీటితోపాటు ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు, అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి పరుస్తున్న పలు స్టేషన్ల గురించి చర్చించారు. వారణాసి, బెంగళూరులకు ప్రస్తుతం నడుపుతున్న వీక్లీ స్పెషల్ రైళ్లు రెగ్యులర్‌గా నడిపేందుకు ప్రతిపాదనలు పంపితే, తన ప్రయత్నాలు చేస్తానని తెలిపారు. విశాఖ నుంచి బయల్దేరే పలు రైళ్లకు జనరల్ బోగీలను పెంచేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని డీఆర్ఎంను ఎంపీ కోరారు.

ఎన్‌జీజీవోస్ కాలనీ అభివృద్ధికి సహకారం



కె.కె.రాజు, అల్లు శంకరరావుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ఎన్‌జీజీవోస్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కొత్త కార్యవర్గ సభ్యులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు మాట్లాడుతూ కాలనీలో పార్కు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఇతర సమస్యలను కె.కె.రాజు సహకారంతో పరిష్కరిస్తానని చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యులకు వారు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త కార్యవర్గ సభ్యులు వీరే..

ఎన్‌జీజీవోస్ కాలనీ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా వీసం పార్వతీశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పి.బలరామస్వామి, కార్యదర్శిగా కె.రామచంద్రరాజు, కోశాధికారిగా కేవీఎస్ఎస్ఆర్ గుప్తా, డైరెక్టర్లుగా కర్రి వివేకానంద స్వరూప్, ఎస్.సాంబశివరావు, ఎం.రాజారావు, ఎం.విశ్వస్వరూప్, పి.శ్రీనివాసరావు ప్రమాణం స్వీకారం చేశారు. కె.కె.రాజు, అల్లు శంకరరావులను కొత్త సభ్యులు ఘనంగా సత్కరించారు. వైభవుడి ఆలయ అర్చకుడు శేషాచార్యులు సభ్యులకు ఆశీర్వచనం అందించారు. అనంతరం వీరంతా అన్నసమారాధనలో పాల్గొన్నారు.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జాన్‌ప్రకాశ్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 159వ దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. శనివారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ద కిందట జ్ఞానాపురంలో కలరా వ్యాధితో అనేక మంది ప్రజలు మృత్యువాత పడ్డారన్నారు. బిషప్ పీటర్ రోస్సియోన్ సూచన ప్రకారం అలయ విచారణ కర్తలు దేవమాత (మరియమాత) స్వరూపం జ్ఞానాపురంలో నేలకొల్పి పురవీధుల్లో తేరును ఊరేగింపు చేస్తే పరిస్థితులు అదుపులోకి వస్తాయన్నారని తెలిపారు. నాటి నుంచి ఆ కార్యక్రమం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆగస్టు 1 మంగళవారం సాయంత్రం ప్లీప్‌గుర్తు మండపంలో పతాకావిష్కరణ అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలువీధుల్లో తిరుగుతుందని 15న జరిగే ప్రధాన మహోత్సవాలను విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో దివ్య బలిపూజ, పుర:ప్రదక్షిణ, బహుమతి ప్రదానం, భారీ బాణసంచాతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. అనంతరం పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి. ప్రభాకర్, వేళంగిణీరావు, పీపీసీ అధ్యక్షుడు వై.అమర్‌దీప్, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి చార్లీ, కార్యదర్శి పి.ఆనందరావు, కోశాధికారి జి.ఆనందరావు, గురు మండలి సలహా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వారాహిదేవి అనుగ్రహంతో కార్యసిద్ధి



ప్రవచిస్తున్న మాతా రమ్యానంద భారతి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమంలో భాగంగా శనివారం శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని లలితాదేవి సైన్యాధ్యక్షురాలైన వారాహిదేవి గురించి ప్రవచించారు. వారాహిదేవి అనుగ్రహంతో విద్య, ఆర్థిక, ఆరోగ్య, కార్యసిద్ధి, భూ సంబంధిత వివాదాలు తీరి సకల సంతోషాలు ప్రసాదిస్తాయన్నారు. దుర్గాదేవి అవతార విశేషాలతో ప్రవచనం ముగించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

చెట్ల కొమ్మల నరికివేతతో ఇబ్బందులు

మురళీనగర్: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెట్ల కొమ్మల నరికివేతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీరు వీలైప్పుడల్లా అవసరం మేరకు విద్యుత్ సరఫరాలో సమస్యలు తొలగించడానికి ట్రీ కటింగ్ నిర్వహిస్తుంటారు. అంతవరకు బాగానే ఉన్నా.. చెట్ల కొమ్మలను ఆయా ప్రాంతాల నుంచి తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయడంతో విఫలమవుతున్నారు. ఏదో మొక్కుబడిగా కొన్ని చోట్ల తొలగించి మిగతా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. ఇలా వారాల తరబడి ఉండిపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వీటి తరలింపు శానిటరీ సిబ్బందికి భారంగా మారింది. రచ్చబండ ఏరియా, మురళీనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ వారు వదిలేసిన చెట్ల కొమ్మలను శానిటరీ సిబ్బంది శనివారం తొలగించారు. 49వ వార్డు ఇన్‌స్పెక్టర్ ముప్పల రామకృష్ణ పర్యవేక్షణలో శానిటరీ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది వీటిని తరలించారు. వర్మా కాంప్లెక్సు వెనుక టెన్నిస్ కోర్టు సమీపంలో ఉన్న కొమ్మలను ఆదివారం తొలగిస్తామని అధికారులు చెప్పారు.

ఎన్ఈపీ వార్షికోత్సవ లైవ్ వీక్షణ



ఎన్ఈపీ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షిస్తున్న కేవీ ప్రిన్సిపాల్, విద్యార్థులు

తాటిచెట్లపాలెం: జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) ప్రవేశపెట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ప్రధాని నరేంద్రమోదీ కార్యక్రమాన్ని కేంద్రీయ విద్యాలయ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, సిబ్బంది, విద్యార్థులు లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పీఎం మోదీ తన ప్రసంగంలో ప్రస్తుత కాలంలో విద్య ప్రాధాన్యాన్ని తెలియజేశారన్నారు. దీనిలో భాగంగా కేంద్రీయ విద్యాలయాల్లో 3వ ఏట నుంచే పిల్లలను చేర్పించేలా ప్రభుత్వం బాలవాటిక 1, 2, 3లను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానంతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఎన్ఈపీ ద్వారా పిల్లలు అన్ని విభాగాల్లో అభివృద్ధి సాధిస్తారని ప్రధానోపాధ్యాయిని వి.ఎం.శైలజ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గురించి తెలియజేసేందుకు విద్యార్థులతో కలిసి లైవ్ వీక్షించినట్లు ప్రిన్సిపాల్, హెచ్ఎంలు తెలిపారు. పీజీటీ కంప్యూటర్స్ స్నేహలత, సీనియర్ ప్రైమరీ టీచర్ రేఖ, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు విశేష హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మసీదుల్లో మొహర్రం ప్రార్థనలు



జాకీర్‌హుస్సేన్ నగర్ మసీద్‌లో తక్రీర్ పఠిస్తున్న మత గురువు, ముస్లింలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ ఈ అల్ ఖదీర్, మద్రిపాలెం మస్జిద్–ఈ అల్ ఫతా మస్జిద్‌ల్లో శనివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్యాగానికి ప్రతీకైన మొహర్రం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు, ప్రార్థనలు చేశారు. ఆయా మసీదుల ప్రాంగణాల్లో ముస్లిం పవిత్ర ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌ను స్మరిస్తూ మత గురువులు తక్రీర్ పఠించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన పానీయాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీద్ అధ్యక్షులు గౌస్, మున్నా, కార్యదర్శి వలి, బాషా, నూరి తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో శనివారం దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సూచనల మేరకు అప్పయ్యనగర్ ప్రాంతాల్లో కార్యకర్తలు ఫాగింగ్ చేయించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, వీటి ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఫాగింగ్ నిర్వహించినట్టు ఆయన తెలిపారు.